1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జీతేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



లోక్ సభ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జీతేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. కాగా సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్ లోని 25 వ నెంబరు గదిలో వినతులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండలంలోని గండివేట్ గ్రామనికి చెందిన పెద్దాపురం రాజు (18) విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన పెద్దాపురం రాజు తమ సొంత వ్యవసాయ పొలం వద్ద వరి పంటకు నీళ్ల పారించడానికి స్టార్టర్ డబ్బా దగ్గరికి వెళ్లాడు. మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాస్తు విద్యుత్ వైర్ తగిలి రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజుకు ఇంకా వివాహం కాలేదు. చేతికొచ్చిన కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు అక్కడున్న వారిని కలిచివేశాయి. మృతుని తండ్రి గంగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

అకాల వర్షంతో అతలాకుతలం



రెంజల్‌లో నేలవాలిన వరి పంట

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- భారీ వర్షంతో పంటలకు తీవ్ర నష్టం
- నేలవాలిన వరి పైరు.. రాలిన ధ్యానం
- మొక్కజొన్న, జొన్న, మామిడికి తీవ్ర నష్టం
- పంట చేతికొస్తున్న వేళ రైతన్న ఆక్రందన
- కామారెడ్డి జిల్లాలో 20 వేల, నిజామాబాద్ జిల్లాలో 10 వేలకు పైగా ఎకరాల్లో పంట నష్టం
- పరిశీలించిన అధికారులు, ఎమ్మెల్యేలు



కామారెడ్డిలో నేలవాలిన మొక్కజొన్న..



వర్నిలో జొన్న పంట

నవతెలంగాణ-విలేకరులు

అకాల వర్షం రైతన్నలను అతలాకుతలం చేసింది. వడగండ్లు కురిసి వారికి కడగండ్లు మిగిల్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రంతో పాటు రాత్రి వేళ కురిసిన భారీ వడగండ్ల వర్షం తీవ్ర నష్టం మిగిల్చింది. ఈదురుగాలుల ధాటికి వరి పైరు నేలకొరగగా, వడ్లు రాలిపోయాయి. పంట చేతికి వస్తున్న దశలో కురిసిన అకాల వర్షం తీవ్రంగా నష్టపరిచిందని రైతులు వాపోతున్నారు. కాగా నష్టం వాటిల్లిన పంటలను పలువురు ఎమ్మెల్యే పరిశీలించారు. పలు చోట్ల అధికారులు, ఎమ్మెల్యేలు పత్తా లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిచ్కుంద : బిచ్కుంద మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం సాయంత్రం ఆకస్మికంగా వచ్చి గాలి వడగండ్ల వాన బీభత్సం సృష్టించడంతో తీవ్ర పంట నష్టం కలిగించింది. చేతికొచ్చిన వరి, పొగాకు, మొక్కజొన్న పంటలు మామిడి తోటల్లో ఎక్కడ చూసినా రాలిపోయిన మామిడికాయలు కనిపించాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు రెండు మూడు గంటల్లో బీభత్సమైన వడగండ్ల వాన పడడంతో పూర్తిగా నేలపాలు కావడం ఆ దృశ్యాలను చూసి చలించిన రైతులు కన్నీరు పెట్టుకున్నారు. మండలంలోని హస్గుల్, శెట్లూర్, ఖత్గాం గ్రామాలలో వేల ఎకరాల్లో వరి, పొగాకు, మొక్కజొన్న పంట నేలపాలయ్యాయి. బలంగా వీచిన ఈదురుగాలులకు రహదారులపై చెట్లు విరిగి పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చుట్టుపక్కల మండలాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు రాత్రి 12 గంటల వరకు శ్రమించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.

పత్తాలేని వ్యవసాయ అధికారులు

మండలంలోని హస్గుల్, శెట్లూర్, ఖత్గాం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో వేల ఎకరాల్లో వరి, పొగాకు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లగా మామిడి తోటల్లో మామిడి కాయలు నేలపాలయ్యాయి. కష్టపడి పండించిన పంటలు నేలపాలు కావడంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచక ఆందోళన చెందారు. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిన కనీసం వ్యవసాయ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి పనితీరును ఎలా ఉన్నదో అర్థమవుతున్నది. ప్రభుత్వం నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వర్ని : మండలంలోని సిద్దాపూర్, గోకుల్ దాస్ తండా, చింతల్ పెట్ తండ, గుంటూరు క్యాంప్ గ్రామాలలో మొక్కజొన్న, జొన్న, గోధుమ శనివారం అకాల వర్షానికి నేలకొరిగి దెబ్బ తినట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. కోత కోయ్య రాకుండా రైతులు కూలీలతో కోసే పరిస్థితి ఏర్పడటంతో 10 శాతం వరకు పంట నష్టం కలుగటం తో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో పాడి పంటలతో పాటు అరుతడి పంటలు 100 ఎకరాల వరకు అకాల వర్షం దెబ్బకు నేలపాలు అయినట్టు సమాచారం. ఇలా ప్రతి ఏటా అకాల వర్షానికి రైతులు నష్టపోతున్నా.. పరిహారం మాత్రం అందడం లేదు. అధికారులు లెక్కలు తీసి ప్రభుత్వాలకు నివేదిస్తున్నా.. ఫలితం మాత్రం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి ఒక్క పైసా నష్టపరిహారం అందలేదని వాపోయారు.

నేలమట్టమైన జొన్న

మద్నూర్ : చేతికి వచ్చిన జొన్న పంటకు భారీ నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండుమూడు రోజుల పాటు వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ తెలపడంతో మబ్బులను చూసి వడగళ్ల వాన ఎప్పుడు కురుస్తుందో ఎలాంటి నష్టం కలిగిస్తుందోనని ఒకపక్క రైతన్న మరో పక్క ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్న కోరుతున్నారు.

నేలవాలిన చెట్లు

బోధన్ : శనివారం రాత్రి ఈదురు గాలులు వడగళ్ల వానకు బోధన్ మండలంలోని పలు గ్రామాలలో చెట్లు, పంటలు నేలకొరిగాయి. బోధన్ నుండి మహారాష్ట్ర వెళ్లే అంతరాష్ట్ర రహదారి సాలూర క్యాంప్ వద్ద రోడ్డు పై చెట్లు పడిపోయాయి. దాంతో రాత్రివేళ విద్యుత్ సరఫరా నిలిచిపోయి పడిపోయిన చెట్లు కనపడక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం పంచాయతీ సిబ్బంది పడిపోయిన చెట్లను తొలగించారు.

నేలకొరిగిన వరి

రెంజల్ : దూపల్లి గ్రామానికి చెందిన రైతు శేషు గారి గంగారెడ్డి మూడు ఎకరాల పొలం నేలకొరిగిందని మండల వ్యవసాయ అధికారి లక్ష్మి కాంత్ రెడ్డి తెలిపారు. మండలంలో దూపల్లిలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందని, ఇతర చోట్ల ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు.

పరిశీలించిన ప్రజాప్రతినిధులు

కామారెడ్డి రూరల్ మండలంతో పాటు భిక్కనూర్, దోమకొండ మండలాల్లో నేలవాటిన పంటలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ విప్ గంపగోవర్ధన్, అధికారులు, నాయకులు పరిశీలించారు. బాన్సువాడలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బోధన్, సాలూర, ఎడపల్లి మండలాల్లో నేలవాలిన వరిని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, పంట నష్టం వివరాలు సేకరించిన నివేదించాలని ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం తీరుతో రైతుల పంటలకు బీమా లేకుండా పోయిందని, దీంతో రైతులు నష్టపోతున్నట్టు తెలిపారు. సహకార సంఘాలను నిర్వీర్యం చేసి ఇన్సూరెన్స్ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పునరుద్ధరించి పంటలకు బీమా సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

డిచ్‌పల్లి : జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, ఏడీఏ ప్రదీప్, మండల వ్యవసాయ శాఖ అధికారి,రాంబాబు, ప్రవీణ్ కుమార్,ఎఈఓలు పలు గ్రామాలను డిచ్‌పల్లి, ఇందల్‌వాయిలోని పలు మండలాలను సందర్శించి నష్టం వివరాలను సేకరించారు. డిచ్ పల్లి మండలం లోని కోరట్ పల్లి, యానంపల్లి, సుద్దులం, రాంపూర్ డి.ఇందల్ వాయి మండలంలోని మేగ్య నాయక్ తండాలో 200వందల ఎకరాలు, నల్లవెల్లి లో 1500 వందలు, సిర్నపల్లి, గౌరరం, గన్నరం తోపాటు మండలంలో దాదాపు 2 వేల ఎకరాలపైనే నష్టం జరిగిందని అంచనా వేశారు. చేతికొచ్చే దశలో పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు వాపోతున్నారు. నష్టపోయిన ప్రతి ఎకరా వివరాలు సేకరించి నివేదిక అంజదేయాలని ఇది వరకే రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అధికారులను ఆదేశించారు.

మోపాల్ : మండలంలో తానాకుర్ధి శివారు ప్రాంతంలో వరి నేలకొరిగింది. పైరు నేలకు ఒరగటం వల్ల చాలా మట్టుకు వడ్లు రాలిపోతాయి. అలాగే హార్వెస్టర్ కోయటానికి ఎకరానికి గంట సమయం పట్టేది ఇప్పుడు దాదాపు రెండు నుంచి మూడు గంటలు సమయం పడుతుంది. పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తే ఇలాంటి సమయంలో బాసటగా నిలిచేదని రైతులు వాపోయారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 20,071 ఎకరాల్లో పంట నష్టం

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు వేలాది ఎకరాల్లో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 24 మండలాలు ఉండగా 15 మండలాల్లో భారీ ఎత్తున పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ విస్తీర్ణ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. 15 మండలాల్లో 130 గ్రామాలలో 14,553 మంది రైతులవి 20,071 ఎకరాల్లో వారి, మొక్కజొన్న, గోధుమ, జొన్న, వేరుశనగ, పెసర తదితర పంటలు వేయగా 33 శాతం పంటలు దెబ్బతిన్న ఆమె తెలిపారు. కామారెడ్డి మండలం కొట్టాలపల్లి గ్రామంలో 250 ఎకరాలలో రైతులు ఉల్లిగడ్డ, వరి, మొక్కజొన్న, పెసర, మినిము, మామిడి తోటలు, కూరగాయల పంటలు తదితర పంటలు వేయగ 90 శాతం వరకు పంటలు నష్టపోయినట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ బాలయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాలలో సర్వే నిర్వహించి ప్రతి రైతుకు పంట నష్టం అందించాలని రైతుల కోరుతున్నారు.

6 గ్రామాలలో పూర్తిగా పంట నష్టం

భిక్కనూర్ : భిక్కనూరు మండలంలోని జంగంపల్లి, లక్ష్మీదేవి పల్లి, అంతంపల్లి, భిక్కనూర్, రామేశ్వర్ పల్లి, తిప్పాపూర్ గ్రామాలలో పంటలు పూర్తిగా నష్టపోయాయి. కాచాపూర్, పెద్ద మల్లారెడ్డి గ్రామాలలో అక్కడక్కడ మొక్కజొన్న, వరి నేలకొరిగింది. వ్యవసాయ అధికారులు ఆదివారం గ్రామాలలోని పంట పొలాలను పరిశీలించి మండలంలో 3,752 ఎకరాల పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. అందులో 2960 ఎకరాల వరి, 150 ఎకరాల మామిడి, 50 ఎకరాల, కూరగాయలు, 592 ఎకరాల మొక్కజొన్న నష్టం జరిగిందని వ్యవసాయ అధికారి రాధా తెలిపారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పంట నష్టం జరిగిన గ్రామాలను పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టం జరిగిన రైతులను ఆదుకొని ఎకరానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం చెల్లించాలని తెలిపారు.



నేలవాలిన మొక్కజొన్న



పంటలను పరిశీలిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే



నేలవాలిన పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ..



డిచ్‌పల్లిలో రాలిన ధాన్యం..



మడిలో నిలిచిన నీరు



మోపాల్‌లో నేలకొరిగిన వరి

ఈసారి త్రిముఖ పోరు

- నిజామాబాద్, జహీరాబాద్ స్థానాల్లో హోరాహోరీ సాగనున్న పోటీ
- నిజామాబాద్ స్థానానికి ఇది వరకు 17 సార్లు ఎన్నికలు..
- అత్యధికంగా 11 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు
- ఈసారి పట్టుసాధించేందుకు పార్టీల వ్యూహాలు



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అందరి చూపు రాజకీయాలపై పడింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు నిజామాబాద్‌తో పాటు జహీరాబాద్ లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 1952వ సంవత్సరం నుంచి నిజామాబాద్ స్థానానికి ఎన్నికలు జరుగుతుండగా.. 2008లో జహీరాబాద్ లోక్‌సభ నియోజక వర్గాన్ని జనాభా ప్రతిపాదికన ఏర్పాటు చేశారు. కాగా రెండు నియోజకవర్గాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ప్రధానంగా మూడు పార్టీల నుంచి ఎమ్మెల్యేలు గెలుపొంద డంతో ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది.

1952 నుంచి పార్లమెంట్‌లో నిజామాబాద్ ప్రాతినిధ్యం..

నిజామాబాద్ లోక్‌సభ స్థానం 1952లో ఏర్పడింది. ఈ స్థానంలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈసారి 18వ ఎన్నిక జరుగుతుండటం విశేషం. అయతే 11 సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందగా, మూడు సార్లు టీడీపీ, ఒకొక్కసారి బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. 1967లో అనూహ్యంగా ఎం.నారాయణరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది చరిత్ర సృష్టించారు. 1952లో జరిగిన తొలి ఎన్నికలో హరీశ్ చంద్ర హెడె గెలుపొందారు. 1952, 57, 62 వరుసగా మూడు ఎన్నికల్లో గెలుపొంది హైట్రిక్ సాధించారు. 1967లో జరిగిన ఎన్నికల్లో ఎం.నారాయణ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందగా, 1971 నుంచి 1980 వరకు ఎం.రామ్‌గోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి మూడు పర్యాయాలు గెలుపొం దారు. తదనంతరం 1984, 1989 ఎన్నికల్లో తాడూర్ బాలాగౌడ్ కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి రెండు పర్యాయాలు వరుసలగా గెలిచారు. అప్పటి వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు వరుసగా(1967 మినహా) గెలుపొందుతుండగా.. దానికి చెక్ పెడుతూ 1991లో గడ్డం గంగారెడ్డి టీడీపీ తరవున పార్లమెంట్‌కు ఎన్నికైయ్యారు. 1996లో అత్మచరణ్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా.. 1998, 1999 ఏడాది గ్యాప్‌లో వచ్చిన వరుస ఎన్నికల్లోనూ గడ్డం గంగారెడ్డి టీడీపీ నుంచి విజయ ఢంకా మోగించారు.

2004, 2009లో కాంగ్రెస్ నుంచి మధుయాష్కి గెలుపొందగా.. తదనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి కల్వకుంట్ల కవిత గెలుపొందారు. తదనంతరం జరిగిన పరిణామాలతో 2019లో కవితపై ధర్మపురి అరవింద్ బీజేపీ నుంచి గెలుపొందారు. ప్రస్తుతం 18వ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి అరవింద్ బరిలో నిలవగా, బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పోటీలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి ఇంకా అభ్యర్థి ఖరారు కాలేదు.

2008 ఏర్పడ్డ జహీరాబాద్

జహీరాబాద్ లోకసభ స్థానం 2008లో ఏర్పడింది. జనాభా, సరిహద్దుల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనలో ఏర్పడింది. 2009లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సురేశ్ షెట్కార్ ఎంపీగా గెలుపొందారు. తదనంతరం తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుంచి 2014, 2019 రెండు పర్యాయాలు బీబీపాటిల్ గెలుపొందారు. అయితే ఈసారి బీజేపీ తీర్థం పుచ్చుకొని బీబీపాటిల్ బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ పోటీలో నిలిచారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- ప్రజలు, పార్టీల నాయకులు సహకరించాలి
- అనుమతితోనే సభలు, సమావేశాలు నిర్వహించాలి : కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

పార్లమెంటు ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో కలెక్టర్, సీ.పీలు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని, జూన్ 6వ తేదీ వరకు ఇది అమలులో ఉంటుందని తెలిపారు. నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సీఎంసీ కళాశాలలో కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు.

2019 పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కూడా సీఎంసీలోనే చేపట్టినప్పటికీ కేవలం నిజామాబాద్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లను మాత్రమే ఇక్కడ లెక్కించారని, పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల శాసనసభ నియోజకవర్గాల ఓట్లను జగిత్యాలలో లెక్కించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సారి మాత్రం నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలైన ఓట్లన్నీ ఒకేచోట సీఎంసీలోనే కౌంటింగ్ జరుపుతామని, ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్ సహా జిల్లా పరిధిలో మొత్తం ఆరు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున అనుమతులు లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. ముందస్తుగా అనుమతి తీసుకున్న మీదటే సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని, నోడల్ అధికారులను నియమించామని అన్నారు.

18 చెక్ పోస్టులు : సీపీ

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ నాటికి వీటి సంఖ్య మారే అవకాశాలు ఉంటాయన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు జిల్లాలో మొత్తం 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిలో అంతరాష్ట్ర సరిహద్దులలో నాలుగు ఉమ్మడి తనిఖీ కేంద్రాలు ఉండగా, జిల్లాల సరిహద్దు ప్రాంతాలలో ఆరు చెక్ పోస్టులు, జిల్లాలోనే స్థానికంగా వివిధ ప్రాంతాలలో మరో ఎనిమిది తనిఖీ కేంద్రాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు తగిన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆ కమిటీకి తగిన ఆధారాలు సమర్పించినట్లయితే గ్రీవెన్స్ కమిటీ వాటిని పరిశీలించి నగదు విడుదల చేస్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను సన్మానించిన రాష్ట్ర ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా నియమింపబడిన సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారి నివాసంలో కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు మాజీ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గోర్త రాజేందర్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో శ్రీరామ నవమి ఏర్పాట్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

ప్రతి మాదవనగర్ లోని సాయిబాబా మందిరంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ఏర్పాటు చేస్తారని మనందరికీ తెలిసిన విషయమే దానికి సంబంధించి ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ 17 న నిర్వహించే శ్రీ రామ నవమి సందర్భంగా రంగులు వేయుటకు, పూలతో అలంకరణ చేయుటకు, విద్యుత్ అలంకరణ చేయుటకు, క్యూ లైన్ ఏర్పాటు చేయుటకు, వంట పాత్రలు టెంట్ హౌస్ సామాను సప్లై చేయుటకు, అన్నదానం కోసం వంట చేయుటకు కొటేషన్స్ కోరుతున్నారు ఈ కొటేషన్ ఈనెల 23న శనివారం ఉదయం 11 గంటల వరకు స్వీకరించబడుతుందని తెలిపారు. ఆదేరోజు 12 గంటలకు దేవదాయ శాఖ అధికారి సమక్షంలో ఓపెన్ చేసి తక్కువ కోడ్ చేసిన వారికి పని కేటాయిస్తామని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- ఇద్దరికీ తీవ్ర గాయాలు


గాయపడ్డ వృద్దులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో కుక్కను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. అందులో ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. నిజామాబాద్ పట్టణం నుంచి భీంగల్‌కు ప్రయాణిస్తున్న ఆటో పడకల్ గ్రామానికి రాగానే కుక్క అడ్డం రావడంతో ఆటో డ్రైవర్ తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు వీరు నిజామాబాద్ పట్టణం వినాయకనగర్‌కి చెందిన వారు గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి తరలించారు.

కార్పొరేషన్ నామినేటెడ్ పదవులపై సంబరాలు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తమ నాయకులకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు లభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్, తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ టౌన్ ప్రెసిడెంట్ సంజీవ్‌గౌడ్ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల మైనారిటీ అధ్యక్షుడు షేక్ జావిద్, పార్టీ నాయకులు కట్టెల శ్రీనివాస్‌గౌడ్, కుందారం శ్రీనివాస్, సంతోష్ గౌడ్, గోపు ఉషాన్న, వడ్ల రాజేశ్వర్, మెట్టు అశోక్, ఇమ్రాన్, విక్కీ, పురుషోత్తం, వినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అల్ ఇండియా సెపక్ తక్రా టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు టీయూ జట్టు


క్వార్టర్ ఫైనల్‌కు చేరిన టీయూ జట్టు

నవతెలంగాణ-మోపాల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఆదోనిలో జరుగుతున్న అల్ ఇండియా యూనివర్సిటీ సెపక్ తక్రా టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా తెలంగాణ యూనివర్సిటీ జట్టు ఆదివారం క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. వరుస విజయాలతో జిల్లాలోని నిషిత కాలేజీ క్రీడాకారుడు బి. ఉదయ్ కుమార్ అద్భుత ప్రదర్శనతో క్వార్టర్స్‌కు చేరుకుంది. క్వార్టర్స్‌లో రాయలసీమ యూనివర్సిటీ జట్టుతో తలపడనుంది. టీం కోచ్ గా వ్యవరిస్తున్న జిల్లా సెపక్ తక్రా కార్యదర్శి గాధరి సంజీవ రెడ్డి, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్.నేత క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ విజయం సాధించాలని సూచించారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డిని రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించినందుకు, మానాల మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మర్యదపర్వకంగా కలిసి ఆదివారం ఘనంగా సన్మానించారు.

పది పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం

- మండల విద్యాశాఖాధికారి రాజా గంగారం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ నెల 18నుండి పది పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు డిచ్ పల్లి మండల విద్యాశాఖాధికారి రాజా గంగారం అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 08 పరీక్ష కేంద్రాలు 08 మంది సిఎస్‌లు, 08 మంది డిపార్టుమెంటు ఆఫీసర్ లు, 86 మంది ఇన్విజిలేటర్లను నియమించామని, మొత్తం విద్యార్థులు 1224 పరీక్షలు రాయనున్నట్లు, పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించ బడుతుందని 9:35 నిమిషాల వరకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. విద్యార్థులు ఒక గంట ముందు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోనే విదంగా చుడాలని పేర్కొన్నారు. హాల్ టికెట్లు అందని వారు www.bsc.telangana.gov.in వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ప్రధానోపాధ్యాయుల సంతకం లేకున్నా అనుమతించ బడుతుందని వివరించారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

నవతెలంగాణ-ముప్కాల్

పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ భాస్కరా చారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఇంటర్ పరీక్షలు ముగిసిన వేళ వేసవి సెలవులంటు సరదాగా బయట ప్రదేశాలకు వెళ్తుంటారని పేర్కొన్నారు. వారికి వాహనాలు ఇవ్వడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, ప్రాజెక్టు సందర్శన అంటూ గోదావరి నది నీటిలో స్నానాలు లాంటివి చేయడం ద్వారా వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. కావున తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని కోరారు.

పార్లమెంట్ ఎన్నికల సమాచారం అందించాలి

- మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని రూమ్ నెం.28 లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలు వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ ఛానెల్స్‌లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసిఎంసి నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటా యని స్పష్టం చేసారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపా తంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించా లని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అం కిత్, కిరణ్ కుమార్, ట్రైనీ ఐ.ఏ.ఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీ ఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, జిల్లా పౌ ర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఎన్నికల ప్రచార సభలకు అనుమతి తీసుకోవాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్, సీపీ సూచన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు. ఆదివారం సమీఋ-కృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్, సీ.పీలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీల తరపున కృషి చేయాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని అన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, అయితే కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేషాలు చెలరేగేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసిసి, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎం.సీ.ఎం.సీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు,ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ తదితర పబ్లిక్ ప్లేస్ లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. కాగా, జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని , ఈ అంశాన్నిఅన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎన్నికల ప్రచార ప్రకటనలు, కరపత్రాలలో ముద్రించే అంశాలు, ఇతర ప్రచార అంశాలకు సంబంధించి తప్పనిసరిగా ఎం.సీ.ఎం.సీ ద్వారా ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, దీనిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ ఐ.ఏ.ఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

అకాల వర్షానికి కూలిన గుడిసెలు



- గుడిసె వాసులను ఆదుకోవాలి
- ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు కృష్ణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు నిజామాబాద్ నగరంలోని అభయ హస్తం కాలనీలోని గుడిసెలు కూలిపోయి గుడిసెవాసులు నిరాశ్రయులు అయ్యారు. ఈ ప్రాంతాన్ని ఇల్లు, ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు ధ్యారంగుల కృష్ణ, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని దుబ్బా ప్రాంతంలో గల అభయ హస్తం కాలనీలో 250 కుటుంబాలు ఏడాదిన్నర కాలంగా నివాసం ఉంటున్నారని, ప్రకృతి విపత్తు వల్ల నిర్మించుకున్న ఇండ్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇండ్ల పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇండ్ల స్థలాల ప్రజలు మునవార్, రాజన్న, నర్సింగ్, సావిత్రి, తదితరులు ఉన్నారు.


కూలిన గుడిసెలను పరిశీలిస్తున్న పలువురు

బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతంలో నేరాల నియంత్రణకు కార్యాచరణ ఏర్పాటు

- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్


పలు ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ టౌన్ పరిధిలోని ఆర్‌టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాలలో ఈ మధ్యకాలంలో వ్యభిచారం, దొంగతనాలు, స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ మధ్య ఒక హత్యకేసు నమోదు అయిందని, నేరాల నియంత్రణకోసం ఈ నెల16న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవర్ ఆర్‌టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాలను ఆదివారం క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఆర్‌టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాలలో వ్యభిచారం నిర్వహణ, మనుషుల ను డైవర్షన్‌కు గురిచేసి దొంగతనాలు, వస్తువులను గుంజుకొని పోవడం, గొలుసు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. ఈ కేసులు తమ దృష్టికి వచ్చాయని, నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం ఆర్‌టిసి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు గల రోడ్డు మార్గంలో ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారని తెలిపారు. గుర్తించబడిన ఆటోస్టాండ్స్, ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ చేయు స్థలాలలో మఫ్టీ డ్రెస్‌లో (సివిల్ డ్రెస్) పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఈ మార్గంలో అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేసినట్లయితే సీజ్ చేయడం జరుగుతుందని, ఈ మార్గంలో రోడ్డు ఆక్రమణ చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మనిషికి ధ్యానం ముఖ్యం

- పిఎస్ఎస్ఎమ్ నవనాథపురం రెండవ వార్షికోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలోని నవనాథ సిద్దలగుట్టపై నిర్వహించిన పిఎస్ఎస్ఎం నవనాథపురం రెండో వార్షికోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పత్రీజీ ధ్యాన గ్రామీణ 108 రోజులు, 108 గ్రామాల విజయోత్సవ సంబరాల్లో ఆయన మాట్లాడారు. ఈ రోజుల్లో మానసిక ఒత్తిళ్ళను తట్టుకోవడానికి మనిషికి ధ్యానం అనేది ముఖ్యమని సూచించారు. అందరూ ఒకే చోట కూర్చొని ధ్యానం చేయడానికి నిర్మించుకున్న ఈ ధ్యాన మందిరం వాతావరణం ఆహ్లాదకరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కీర్తిశేషులు పరమపూజ సుభాష్ పత్రీజీతో తనకున్న సాన్నిహిత్యాన్ని, సత్సంబంధాలను గుర్తు చేసుకున్నారు. పత్రీజీ మారదర్శకంలో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన కోరారు. ధ్యాన మందిర నిర్వాహకుల కోరిక మేరకు నియోజకవర్గ నిధుల నుండి పది లక్షల రూపాయలను ధ్యాన మందిరం అభివృద్ధికి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వేడుకల్లో నవనాథ సిద్దుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులను మర్యాదపూర్వకంగా పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. అనంతరం ధ్యాన మందిరం ఎదురుగా ఒకవైపు మహాశివుని విగ్రహం, మరోవైపు సుభాష్ పత్రీజీ విగ్రహ ఏర్పాట్ల కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ట్రస్ట్ జ్ఞాన దాత దామోదర మహాస్వామి, జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణ రెడ్డి ట్రస్ట్ సభ్యులు గంగారెడ్డి, శ్రావ్య గార్డెన్స్ గంగారెడ్డి, శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయి బాబా గౌడ్, సిద్దుల గుట్ట కమిటీ సభ్యులు భారత్ గ్యాస్ సుమన్, జిమ్మీ రవి, ప్రశాంత్ గౌడ్, టీడీ శ్రీనివాస్, చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యంతో ప్రాణాలను కాపాడుకోవచ్చు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

హోమియో వైద్యం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న సందర్భంలో ప్రాణాలను నిలబెట్టిందని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. ఆదివారం నగరంలోని హరిత నగర్ ఆకుల హన్మంతు మహిళా భవన్‌లో ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ వెంకట్‌రెడ్డి పదవి విరమణ చేసిన సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ (పివైఎల్) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో ఆకుల పాపయ్య మాట్లాడారు. గల్లీలో చాలామంది అత్యవసర ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వెంకట్ రెడ్డి హోమియో వైద్యం ద్వారా వాళ్ళ ప్రాణాలను కాపాడుకోగలిగామని అన్నారు. అంతకుముందు కొంతమంది అనారోగ్య బారిన పడితే హోమియో మందులు వాడడం వల్లనే వారి జీవితాలను నిలబడ్డాయని గుర్తు చేశారు. ఇదే కాకుండా అల్లోపతి మందులు అంటే వ్యాపార రంగంగా మారిందని, వైద్యం అంటేనే వ్యాపారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. హోమియో, ఆయుర్వేదం, యునాని లాంటి మందులు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలలో చాలా ఉన్నాయని అన్నారు. ఇవి నయం చేసే మందులని ప్రజలు కొద్దీగా ఓపికతో వాటి వైపు చూస్తే ఖచ్చితంగా దాని ఫలితం తెలుస్తుందని అన్నారు.

డాక్టర్ వెంకట్ రెడ్డి లాంటి మానవతావాది 35 సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్యం పేదలకు అందిస్తూనే మరోవైపు సెలవుల్లో పేదలకు అతి తక్కువ ఫీజుతో వైద్యం అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా హోమియో వైద్యులు డాక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తన శరీరాన్ని తాను కంట్రోల్లో పెట్టుకుంటే సగం రోగాలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. హోమియో వైద్యంలో వాళ్ళ శరీరతత్వాన్ని వాళ్ళ ఆహారపు అలవాట్లను కరెక్ట్‌గా డాక్టర్‌కి తెలియజేసినట్లయితే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ద్వారా ఎంతటి పెద్ద రోగాన్ని అయినా సరైన సమయంలో తగ్గించుకోవచ్చని తెలిపారు. టెన్షన్ పడితే అనారోగ్యానికి దారి తీస్తుంది అని చెప్పారు. కుటుంబంలో అందరూ కలిసిమెలిసి సఖ్యతతో ఉన్నప్పుడు చాలా మేరకు రోగాలు రాకుండా ఉంటాయని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ప్రముఖులు డాక్టర్ వెంకట్ రెడ్డి దంపతులను సన్మానించారు. డాక్టర్ స్పందన వైద్యం అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుగందుల మురళి, కార్మిక సంఘ నాయకులు సిద్ధి రాములు, ఆకుల సత్యనారాయణ, పివైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, రమేష్, మహిళా సంఘం పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు అరుణ, సరిత, నర్సవ్వ, సబిత, పిడిఎస్యూ నాయకులు జన్నారపు రాజేశ్వర్, ఇఫ్టు నాయకులు శివ, రవి, రాజన్న, లతో పాటు స్నేహితులు, న్యాయవాదులు, రిటైర్డ్ ఉద్యోగులు, శ్రీనగర్(పాల్దా) గ్రామ ప్రజలు డాక్టర్ వెంకట్ రెడ్డి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

సిఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సిఈఐఆర్ ద్వారా బాధితులకు ఎస్సై కొండ విజయ్ ఆదివారం అందజేశారు. రామారెడ్డి గ్రామానికి చెందిన సిహెచ్ నర్సింలు, రెడ్డిపేట గ్రామానికి చెందిన డి.చిరంజీవి సెల్‌ఫోన్లు పోగొట్టుకొని, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఇరువురి ఫోన్‌లను ట్రేస్ చేసి అందజేసినట్లు ఎస్సై కొండ విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్సై విజయ్‌కి ధన్యవాదాలు తెలిపారు.


ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై విజయ్

బెల్ట్ షాపుపై దాడి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని తుంకిపల్లి గ్రామంలో సాయిబాబా అనే వ్యక్తి అక్రమంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు షాప్ వద్దకు వెళ్లి పరిశీలించగా.. 33 లీటర్ల మద్యం లభించిందని ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆ మద్యంను సీజ్ చేసి పంచనామా నిర్వహించినట్టు పేర్కొన్నారు. అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.


మద్యాన్ని పట్టుకున్న ఎస్సై సుధాకర్

పనులు శిలాఫలకాలకే పరిమితం

- నిధులు మంజూరయ్యాయా? లేదా?
- ప్రజల్లో సందేహం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమిత మయ్యాయి. అట్టహాసంగా అభివృద్ధి శిలాఫలకాలను ప్రారంభించినా.. పనులు మాత్రం ఎక్కడా ప్రారంభించన దఖలాల్లేవు.


అభివృద్ధి పనుల కోసం ప్రారంభించిన ఓ శిలాఫలకం

మద్నూర్ మండలంలోని గోజేగావ్ గ్రామానికి వెళ్లే మధ్యలో గల లేండి వాగుపైన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం, అలాగే ఆ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం దాదాపు రూ.6.30 కోట్ల రూపాయల నిధులను సంబంధించిన శిలాఫలకాలు అభివద్ధి పనులు జరగకుండా దర్శనమిస్తున్నాయి. ఇక మండలంలోని అంతాపూర్, సోమూర్, గ్రామాల మధ్య గల వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3కోట్ల 50 లక్షల నిధులతో శిలాఫలకం వేసి ఆరు మాసాలు అవుతుంది. ఇవే కాకుండా నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలంలోని లింబూర్‌వాడి గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణం, వాడి గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో వాగుపైన వంతెన నిర్మాణానికి మూడున్నర కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆరు మాసాల క్రితం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మదన్‌హిప్పర్గ గ్రామ సమీపంలో వాగుపైన వంతెన నిర్మాణం కోసం మూడున్నర కోట్లు మంజూరు చేశారు. బ్రిడ్జి నిర్మాణం పనులు శిలాఫలకానికే పరిమితం కావడం ఇలాంటి బ్రిడ్జిల్లా నిర్మాణాలే కాకుండా బీటీ రోడ్ల నిర్మాణాల కోసం పనులు జరగకుండా కోట్లాది రూపాయల నిధులకు చెందిన శిలాఫలకాలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అసలు నిధులు మంజూరు అయ్యాయా లేదా అనే సందేహం నెలకొంది. ఆరు మాసాలైనా పనులు ప్రారంభం కాకపోవడానికి కారణం ఏమిటనే చర్చ మద్నూర్, డోంగ్లి మండలాల ప్రజల్లో జరుగుతోంది.

నిధుల మంజూరులో గత ప్రభుత్వ లోపమా లేక మంజూరైన అభివద్ధి పనులకు ప్రస్తుత ప్రభుత్వం పనులు చేపట్టడం లేదా అనేది ప్రజల్లో సందేహం నెలకొంది.

కాంగ్రెస్‌లో వర్గపోరు

- పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత..

నవతెలంగాణ-రామారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో వర్గ పోరు భగ్గుమంటోంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గల రామారెడ్డి మండలం రెండు నియోజకవర్గాల్లో ఉండటంతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మధ్య గతం నుంచే పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుంది.

కాంగ్రెస్ రామారెడ్డి మండలాధ్యక్షునిగా శీల సాగర్‌ను నియమించడంతో భగ్గుమన్న వర్గపోరు, మండల యూత్ ప్రెసిడెంట్ రామారెడ్డి గ్రామానికి చెందిన వడ్ల ఆనంద్‌ను నియమించడంతో మరోసారి సోషల్ మీడియాలో కార్యకర్తల వాయిస్ కాల్స్ హల్‌చల్ అయ్యాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి జెండాలు మోసిన నాయకులకు, కార్యకర్తలతో చర్చించకుండానే, కొత్త వ్యక్తులకు మండల పార్టీ పదవులు కట్టబెడుతున్నారని, రెండు వర్గాలుగా కాంగ్రెస్ పార్టీ విడిపోయి ఆరోపణలు చేసుకోవడం, ఎల్లారెడ్డి నియోజకవర్గం లో చర్చనీయాం శంగా మారింది. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లగా.. నేనే రాజు, నేనే మంత్రిని అనే విధంగా వ్యవహరిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

రామారెడ్డి మండలంలో ఆదివారం సోషల్ మీడియాలో చర్చ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. పోసానిపేట్ గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకులు, రామారెడ్డి గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకునిపై ఫిర్యాదు చేయడంపై వర్గపోరు భగ్గుమన్నది. కాంగ్రెస్ అధిష్టానం వెంటనే స్పందించి నాయకులు, కార్యకర్తల మధ్య చర్చించి కష్టపడిన వారికి పదవులు అందేలా చర్యలు తీసుకోవాలని, అందరూ ఒక్కతాటిపై నిలబడి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా అధిష్టానం చర్యలు తీసుకోవాలని నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటింగ్ శాతం పెంపునకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లు 12 రకాల కార్డులను ఉపయోగించుకోవచ్చని సూచించారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు విస్తతంగా ప్రచారం చేపట్టాలని కోరారు. ఆధార్ కార్డు, ఉపాధి హామీ కార్డు, పాన్ కార్డు, పాస్పోర్ట్, ఎంప్లాయ్ ఐడి కార్డ్, సదరం కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఈశ్రమ కార్డు వంటి వాటిని చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 18న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుందని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఏప్రిల్ 26 వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యాలు చేయడం నిషేధం అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని కోరారు. లౌడ్‌స్పీకర్ల కోసం అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికలకు 72 గంటల ముందు రాజకీయ పార్టీల నాయకులు ఎలాంటి ప్రచారం చేయకూడదని సూచించారు. అభ్యర్థుల ఖర్చు బ్యాంక్ అకౌంట్ ఆన్లైన్ ద్వారా చేపట్టాలని చెప్పారు. కరపత్రాలు దినపత్రికలో పెడితే ఎంసిఎంసి అనుమతి తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. కరపత్రంపై ఎన్ని కరపత్రాలు పంపిణీ చేస్తారో, వాటి వివరాలు, కరపత్రాలు ముద్రించిన ప్రెస్ పేరు నమోదు చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, ప్రభాకర్ రెడ్డి, కాశీంఅలీ, మదన్ లాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

10 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏ, బి కేంద్రాలు, పోతంగల్ ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రం పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాధికారి నాగనాథ్ పేర్కొన్నారు. బాలురు 241, బాలికలు 235 మొత్తం 476 మంది విద్యార్థులు మూడు సెంటర్లలో పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఎటువంటి ఆందోళనకు గురికావొద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంఎస్పి, అలాగే ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల బోధన్ నియోజకవర్గ సదస్సును ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంఛార్జి శ్రీలక్ష్మి గారి భూమయ్య మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పి నిజామాబాద్ జిల్లా సీనియర్ నాయకుడు శ్రీ డల్లా సురేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపకుడు మాన్యశ్రీ మందకష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ సాధనకై బిజెపి పార్టీకి అండగా ఉండి ఇందూర్ గడ్డపై మరోసారి బిజెపి జెండా ఎగురేసి మూడోసారి నరేంద్ర మోడీని ప్రధాని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర్, మహిళా నాయకురాలు సావిత్రి, నియోజకవర్గ ఇంఛార్జి మారుతి, బోధన్‌టౌన్ అధ్యక్షులు తాడెప్ అభిరామ్, సీనియర్ నాయకుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉమ్మడి మండల కేంద్రంలోని మమ్మద్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన మంగ మల్లయ్య అనే వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా ఎవరైనా చేసినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

వైద్య శిబిరం విజయవంతం


వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు, వైద్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలం మల్కాపూర్ గ్రామంలో అరుణోదయ హాస్పిటల్ బీబీపేట్ వారి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో డాక్టర్ పాండ్యన్ (ఎంబిబిఎస్) పర్యవేక్షణలో గ్రామ చావిడి వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 60 మందికి ఈసీజీ, బీపీ, షుగర్, వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్‌గౌడ్, మండల చైర్మన్ బాషెట్టి నాగేశ్వర్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, వైస్ చైర్మన్ స్వామి, ఎంసి మెంబర్ బాలరాజు, ఏఎన్ఎంలు శ్రీలత, దివ్య, ఆసుపత్రి సిబ్బంది లక్ష్మి, సునీత, సహస్ర, శిరీష, షైముద, శ్రీలత, దివ్య, ఆశావర్కర్లు సత్తవ్వ, అనిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- అందుకోసం చేపట్టే ధర్నాను జయప్రదం చేయండి
- గ్రామ పంచాయతీ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ పిలుపు

నవతెలంగాణ-సదాశివనగర్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సదాశివనగర్ మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు బకాయి పడిన వేతనాలు ఏడు నుంచి ఎనిమిది నెలల వరకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 51 జీవో సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత కేటగిరీల విధానాన్ని కొనసాగించాలని, కారోబార్, బిల్‌కలెక్టర్ల ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం పంచాయతీ ఉద్యోగులకు వేతనాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఐదులక్షల ఇన్సూరెన్స్ అమలుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు ఈనెల 21న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బాలనర్సు, సాయిలు, మల్లేష్, శ్రీను, రవి, ఎల్లయ్య, సంగమేశ్వర్, స్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గ్రామ పంచాయతీ అధ్యక్షులు వెంకట్‌గౌడ్

ఓబీసీ మండలాధ్యక్షుడిగా లచ్చేవార్ నితీన్ నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న నితీన్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు లచ్చేవార్ నితీన్‌ను ఓబీసీ మండలాధ్యక్షుడిగా నియమించారు. ఓబీసీ చైర్మన్ రాజా నరేందర్‌గౌడ్ నియామకపత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి, ఓబీసీ చైర్మన్ రాజా నరేందర్‌గౌడ్ కతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతోపాటు, మండలానికి చెందిన దూపల్లి మాజీ సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్, జిల్లా నాయకులు అంతిరెడ్డి పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్రంలోని పద్మశాలిల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని పద్మశాలి సంఘం అధ్యక్షులు మేక నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ డ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు మేక నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దాల పోరాటం తర్వాత పద్మశాలిలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం హార్షనీయమన్నారు. పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబాటుతనాన్ని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు గంగాధర్, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం..



- తిమ్మానగర్-ఫత్తేపూర్ గ్రామాల నల్లవాగు బ్రిడ్జి
- త్వరలో ప్రారంభించనున్న జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ - ఫత్తేపూర్ గ్రామాల సరిహద్దులో గల నల్లవాగు బ్రిడ్జి ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. కామారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామమైన తిమ్మానగర్ అంతర్ జిల్లా సంగారెడ్డి సరిహద్దు గ్రామమైన ఫతేపూర్ మధ్యగల నల్లవాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైనప్పటికీ అంతర్ జిల్లాల రాకపోకలు పునరుద్ధరించబడతాయని ఇరు జిల్లాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు సంవత్సరాల విరామం తదనంతరం రాకపోకలకు బ్రిడ్జి సిద్ధమైనప్పటికీ మండల కేంద్రంలోని తిమ్మానగర్ రోడ్డులో గల విత్తన, రసాయనిక ఫర్టిలైజర్, వస్త్ర, కిరాణా మార్కెటింగ్, బంగారం, వెండి వ్యాపారాలు కుదేలైనప్పటికీ ఆశించిన స్థాయిలో వ్యాపార లావాదేవీలు కొనసాగడం కష్టతరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాలుగా రాకపోకలు బంద్ అవ్వడంతో అంతర్ జిల్లాలోని నారాయణఖేడ్, సిర్గాపూర్, నల్లవాగు, బిబిపేట్‌ల లో మార్కెటింగ్ వ్యాపారాలు కొనసాగడంతో మండలంలో మార్కెటింగ్ లావాదేవీలు మళ్లీ ఆశించినంత స్థాయిలో కొనసాగడం కష్టతరమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

2021 జులై నెలలో నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన కర్చు గుత్తి, వాసర, వంకడళం గ్రామాలలో కురిసిన భారీ వర్ష ప్రభావానికి ప్రాజెక్టు కుండపోతను తలపిస్తూ 1495 అడుగుల నీటి సామర్థ్యంతో నిండుకుని నిండుకుండను తలపిస్తూ మిగులు జలాల వరదనీరు ప్రాజెక్టు దిగువనున్న తిమ్మానగర్ గ్రామ నల్ల వాగుపై వరద ఉధతి ప్రవహించడంతో పురాతన నల్లవాగు బ్రిడ్జి కొట్టుకుపోవడంతో అంతర్ జిల్లాల రాకపోకలు నిలిచిపోయాయి. గత పాలకుల సంబంధిత ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ కిషన్ 2021 నవంబర్ నెలలో తాత్కాలిక మొరం పనులకు శ్రీకారం చుట్టగా.. అరకొరగా ద్విచక్ర వాహనాలు, ఆటోలలో ప్రయాణించినప్పటికీ పూర్తిస్థాయిలో రాకపోకలు కొనసాగలేకపోయాయి. సంవత్సర కాలం పాటు అరకొరగా ప్రయాణాలు సాగించినప్పటికీ 2022 జులై 12న మళ్లీ కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జితో పాటు ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టక గత నవంబరులో చేపట్టిన తాత్కాలిక పనులు వరద ఉధతికి కొట్టుకుపోవడంతో మళ్లీ కథ మొదటికి వచ్చినట్లయింది. దీంతో అధికారులు చివరకు చేసేది ఏమీలేక గత ప్రభుత్వం సుదీర్ఘ ఆలోచన చేసి బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు వెచ్చించింది. దీంతో నల్ల వాగు బ్రిడ్జి నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో త్వరలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీలు తొలగింపు

నవతెలంగాణ-విలేకరుల బృందం


బోధన్‌లో..

బోధన్ : లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో రావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. బోధన్ మండలంలోని ఆయా గ్రామాలలో రాజకీయ నాయకుల పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ఆదివారం కుమ్మన్‌పల్లి, జాడిజమాల 'పూర్ గ్రామాలలో రాజకీయ ప్రచారాలకు సంబంధించిన ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. గ్రామాలలో పలు పార్టీలకు చెందిన నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దాంతో అధికారులు ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీలను, ఫోటోలను, ప్రచారాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలు లేకుండా తొలగిస్తున్నారు.

ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను గ్రామ పంచాయతీ సిబ్బంది ఆదివారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎక్కడ కూడా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఉండకుడదని నిబంధనలు ఉండటంతో తొలగిస్తున్నట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు.

లింగంపేట్ : ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారం ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఎన్నికల అధికారుల ఆదేశానుసారం మండలంలోని ఆయా గ్రామాలలో ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను గ్రామాల వారిగా తొలగిస్తున్నామన్నారు. అందులో భాగంగానే లింగంపేట్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఆయా పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి



వివాహిత అదృశ్యమైన ఘటన కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డి అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పరి లక్ష్మీదేవి (40) అనే వివాహితకు తన భర్తతో గొడవ జరిగింది. కాగా ఆదివారం 17-3-2024న మధ్యాహ్నం సమయంలో బయట పని ఉందని చెప్పి, ఇంట్లో నుంచి వెళ్ళిపోయి తిరిగి రాలేదు. దీంతో ఆమె కూతురైన ఉప్పరి అంజలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని పోలీసులు సూచించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి ఆహ్వానం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9 తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఝఝఝ.తీషతీవఱతీ.ఖఎ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఏప్రిల్ 21న టీఎల్‌పీ సెట్ 2024 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నా. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

పరీక్ష అట్టలు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్



రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బధిర పాఠశాలలోనీ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, స్టేషనరీ సామాగ్రి ఆదివారం పంపిణీ చేశారు. సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ తమ వంతు సేవలు విద్యార్థులకు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. పదో తరగతి పరీక్షలు చక్కగా రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని, ఉన్నత లక్ష్యాన్ని చేరాలని అన్నారు. కార్యక్రమంలో స్పాన్సర్ కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ మాజీ అధ్యక్షులు పుష్కర్ రావు, సభ్యులు గోనె దామోదర్, రాస ఆనంద్, వినాయక్, పాఠశాల ఇంచార్జ్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట పరిశీలన

నవతెలంగాణ-సిరికొండ



మండలంలో శనివారం వడగండ్ల వాన, ఈదురు గాలులతో నేలకొరిగి రాలిపోయిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారులు ఆదివారం పరిశీలించారు. మండలంలోని చీమన్ పల్లి, తాటిపల్లి, పందిమడుగు, మైలారం, పెదవాల్గోట్, కొండూర్, గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, చీమనపల్లిలో క్లస్టర్ ఏఈవో నిఖిల్, కొండూరు గ్రామంలో ఏడిఏ ప్రదీప్ కుమార్ ఏవో శ్రీకాంత్ పర్యటించారు. సిరికొండ మండలంలో మొత్తం 956 రైతుల యొక్క 1552 ఎకరాలలో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసి జిల్లా వ్యవసాయ అధికారికి నివేదిక పంపించామన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ-ఆర్మూర్

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ ను ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్ ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేడు, ఈనెల 19, 20న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు 21న స్క్రూట్నీ, 22న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం 5గంటలకు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. 28న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నిక ఉంటుందని, అదే రోజు సాయంత్రం 3గంటల నుండి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని చెప్పారు, కార్యక్రమంలో అధ్యక్షులు చిన్నారెడ్డి, బొట్ల జీవన్, జక్కుల శ్రీధర్, శ్రీనివాస్, విశ్వనాథ్, చరణ్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు అండర్ బ్రిడ్జి పనులకోసం పర్యవేక్షణ



పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ బైపాస్ రోడ్డుకు ఇటీవల అండర్ బ్రిడ్జి నిర్మాణం మంజూరయింది. బైపాస్ రోడ్డు క్రాసింగ్ అండర్ బ్రిడ్జి పనులకు అనువుగా ఉంటుందో లేదో తెలుసుకోవడానికి భూమి నాణ్యత పనులను నేషనల్ హైవే అధికారులు ఆదివారం పర్యవేక్షణ చేపట్టారు. మరో మూడు చోట్ల పనులను సైతం పరిశీలించారు.

రాజారామ్ స్టేడియం వాకర్ అసోసియేషన్‌కు సన్మానం

- నూతన కార్యవర్గాన్ని అభినందించిన అర్బన్ ఎమ్మెల్యే



అసోషియేషన్ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నాగారం రాజారామ్ స్టేడియం వాకర్ అసోసియేషన్ కు జరిగిన అధ్యక్ష, కార్యవర్గ ఎన్నికల్లో మఠం రవి అధ్యక్షులుగా గెలుపొందారు. దీపక్ ఉపాధ్యక్షులుగా, ఈశ్వర్ కార్యదర్శిగా, గంగాధర్ అకౌంటెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, వీరిని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తన కార్యాలయంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులుమఠం పవన్, ఆనంద్,గిరి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల్లో టీస్ఆర్టీసీ యూనియన్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

టీఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు ఖమ్మంలో నిర్వహించారని యూనియన్ నాయకులు ఆదివారం తెలిపారు. ఇందులో కామారెడ్డి, నిజామాబాద్ రాష్ట్ర కార్యదర్శిగా జి గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లకోర లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రవి చందర్ రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహాసభల్లో కార్యదర్శి జి రమేష్, అర్గుల్ శ్రీనివాస్, బి.రవీందర్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-కామారెడ్డి



పట్టుకున్న మద్యం బాటిళ్లు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డిలోని ఇందిరా నగర్ కాలనీలో గల దాత్రిక ప్రభాకర్ తన ఇంట్లో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి ఎక్కువ రేటుకు మద్యాన్ని అమ్ముతున్నారని సమాచారం మేరకు ఎస్సై ఇంద్రసేనారెడ్డి, సిబ్బందితో కలిసి దాత్రిక ప్రభాకర్ కిరాణా షాపులో తనిఖీ చేశారు. షాపులో 29 బాటిళ్ల మద్యం లభించగా పంచనామా చేసి సదరు వ్యక్తి దాత్రిక ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో ఏ వ్యక్తి కూడా అనుమతి లేకుండా మద్యాన్ని అమ్మకూడదని, ఒకవేళ అలా చేసిన వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.

నలుగురికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు

- బాల్కొండ నియోజకవర్గం నుండి ముగ్గురు,
- బాన్సువాడ నుండి ఒకరి నియామకం
- కాంగ్రెస్ నేతల సంబరాలు

నవతెలంగాణ-భీంగల్



ఈరవత్రి అనిల్



మానాల మోహన్‌రెడ్డి



కాసుల బాల్‌రాజ్



అన్వేష్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన రెండో పార్టీ అయినా కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ చైర్మన్లను ప్రక్షాళన చేసింది. పార్టీకి నిరంతరంగా సేవలందించిన వారిని నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. దీంట్లో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నలుగురిని కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించడంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి జిల్లా పైనే పడింది. ఇందులో బాల్కొండ నియోజకవర్గంలో ముగ్గురిని నియమించింది. బాల్కొండ నియోజకవర్గంలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు ఖనిజాభివృద్ధి సంస్థ, అప్పటి కమ్మర్‌పల్లి మండలం మానాల గ్రామానికి చెందిన ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి కో-ఆపరేటివ్ యూనియన్, వేల్పూర్ మండలంలోని పచ్చల నడుకుడ గ్రామానికి చెందిన కిసాన్ ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డికి విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించడంతో ప్రభుత్వం ప్రకటించడంతో ఇక్కడి ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం వెలువరించిన 37 కార్పొరేషన్ చైర్మన్‌లలో నాలుగు జిల్లాకు కేటాయించ డంతో ఇక్కడ మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఏ ఒక్క చిన్న కార్యకర్తను కూడా అధిష్టానం మరచిపోకుండా అందుకు అనుగుణంగానే వారికి నామినేటెడ్ పదవులను గాని ఇతర పదవులను అందజేస్తుందన్న దానికి ఇది ఒక ఉదాహరణ.

ఆలూర్‌లో దొంగల బీభత్సం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండల కేంద్రంలో వీధి నెంబర్-18లో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బయ్యు శివలింగం కుటుంబ సభ్యులు పెళ్లికి వెళ్లడంతో ఎవరూ లేని సమయం చూసి దొంగలు శనివారం రాత్రి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా పగలగొట్టి రెండు తులాల ఐదు మాసాల బంగారం, 10,500 నగదు, విలువైన పట్టు చీరలు సుమారు 50 వేల వరకు ఉన్న కొత్త చీరలు, 25 తులాల వెండి సామాగ్రి, ఇత్తడి సామాను ఎత్తుకెళ్లారు. వారి కూతురు సర్టిఫికెట్స్, ఇతర సామాన్లు దొంగిలించి చిందరమందరం చేసి వంట గదిలో ఉన్న కారంపొడి ఇల్లంతా చల్లి వెళ్లిపోయారు. ఇరుగుపొరుగువారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌పార్టీ కండువాలు కప్పుకున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హాసకొత్తూర్ మాజీ సర్పంచ్ కిషన్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మేడపు రమేష్, ఎస్టీ సెల్ మండల నాయకులు మోహన్ నాయక్, రాజారామ్, రేషమైన మురళి, దాస రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుంకేట రవి, కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, గ్రామ శాఖ అధ్యక్షలు రేవతి గంగాధర్, పాలేపు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

పెట్రోలు పోసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన బండి గంగాధర్ (64) సంవత్సరాలు ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తీవ్ర కలవరం రేపింది. స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ వివరాల ప్రకారం.. మానసిక పరిస్థితి బాగాలేక పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రెండు నెలల క్రితం హత్య చేసిన ఘటనలో నిందితునిగా జైలు శిక్ష అనుభవించాడని, డయాలసిస్ రోగి కావడంతో బెయిల్ పై బయటకు వచ్చినట్లు తెలిసింది. ఎస్సై అంజమ్మ మృతదేహాన్ని పరిశీలించి భార్య బండి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కుటుంబ నియంత్రణ శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ఉచిత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల శిబిరం ఎంజె ఆస్పత్రిలో నిర్వహించారు. 45వ సర్జికల్ క్యాంప్ నిర్వహణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా మాట్లాడుతూ.. సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మధు శేఖర్, వైద్యులు నాగరాజు, వసంతకుమారి, ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు మదర్ థెరిసా హై స్కూల్ విద్యార్థిని

నవతెలంగాణ-బాల్కొండ



ప్రశంసాపత్రం అందుకుంటున్న వినూహ్య

వరంగల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలో బాల్కొండ మండల కేంద్రంలోని మదర్‌థెరిసా హైస్కూల్‌కు చెందిన కుమారి వినూహ్య హాజరై నిర్వాహకుల ప్రశంసలు అందుకుంది. ఐదవ తరగతికి చెందిన వినూహ్య పోటీలో పాల్గొని భగవద్గీత శ్లోకాలను ఆలపించి రాష్ట్రస్థాయిలో నాలుగవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు పాఠశాల కరస్పాండెంట్ కె రామలక్ష్మి, డైరెక్టర్ కె సుబ్బారెడ్డి, హెడ్మాస్టర్ కె. నరసింహారెడ్డిలు వినుహ్యను అభినందించారు.

30న ఎంపీపీ పై అవిశ్వాస సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై ఈ నెల 30న అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు నిజామాబాద్ రూరల్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలకు శనివారం నోటీసులు పంపించారు. డిచ్‌పల్లి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇటీవల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో ఏడుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అవిశ్వాసం కోసం 9 మంది మెజార్టీ సరిపోతుంది. ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్నారు. ముల్లంగి(బి)కి చెందిన నడిపల్లి-2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్యను ఎంపీపీగా, వైస్ ఎంపీపీ గా తమ్మతపుర్ ఎంపిటిసి దుండుగుల సాయిలును ఎన్నుకోనున్నట్టు సమాచారం. గత నెలలోనే వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి విశ్వాస పరీక్షలో నెగ్గారు. 30న జరిగే సమావేశంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నుకోనున్నారు.

19న వాహనాల వేలం

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 19న వాహనాలను వేలం వేసున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంట్ నిజామాబాద్ ఆదేశాల మేరకు వివిధ కేసులలో పట్టుబడిన రెండు వాహనాలను వేలం వేయనున్నామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 19న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సముదాయంలోని ఎక్సైజ్ కార్యాలయానికి రావాలని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేస్తాం

నవతెలంగాణ-బాల్కొండ



మాట్లాడుతున్న ఎంఈవో బట్టు రాజేశ్వర్

ప్రతి ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ ఆదివారం విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆదర్శ పాఠశాల కమిటీల నియామకం, విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలు

కార్పోరేషన్ పదువుల్లో ఉమ్మడి జిల్లాకు నాలుగు కేటాయింపు పట్ల హర్షం

నవతెలంగాణ-కంఠేశ్వర్



కంఠేశ్వర్ : సంబరాలు చేసుకుంటున్న నాయకులు

మాజీ విప్ ఈరవత్రి అనిల్ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్ గా తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా, కాసుల బాలరాజ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరద బట్టు వేణురాజ్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం పటాకులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరద బట్టు వేణురాజ్ మాట్లాడుతూ.. జిల్లానాయకులకు కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, జిల్లా అగ్ర నాయకులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ కి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో కష్టకాలంలో కూడా పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం కష్టపడి పని చేసిన వారికి, పార్టీ టికెట్లు త్యాగం చేసిన వారికి సముచిత స్థానం కాంగ్రెస్ పార్టీ కల్పిస్తుంది అనడానికి ఇది మరో నిదర్శనమని ఆయన అన్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన తాహెర్‌బిన్ హందాన్‌ను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నియమించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు నలుగురిని రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించడం జిల్లాకు గర్వకారణమని ఆయన అన్నారు. ఆయా కార్పొరేషన్ల ద్వారా ప్రజలకు మరింత సేవ చేస్తారని ఆయన భరోసా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని రాబోయే లోక్ సభ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి నిజామాబాద్ పార్లమెంట్ సీటును కాంగ్రెస్ పార్టీ గెలిచేలా చేయాలని తెలిపారు. జిల్లా స్థాయి కార్యకర్తలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తుందని ఆయన అన్నారు. కార్పొరేషన్ చైర్మన్లుగా నియామకమైన వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని చట్ట సభలకు కూడా ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, నరేందర్ సింగ్, ప్రసాద్, రాజు, అయూబ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు సాయికిరణ్, శివ, నిఖిల్ రెడ్డి, సందీప్ రెడ్డి, హరీష్ ,రాజేష్, సతీష్ ,అక్షయ్, బబ్లు, ప్రవీణ్, సందీప్ ,కుషాల్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ గా నియామకమైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డిని జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా నియామకమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుజ్జి మల్లయ్య, ఉట్నూరు ప్రదీప్, బద్దం తిరుపతిరెడ్డి, వేములవాడ జగదీష్, తదితరులు ఉన్నారు.

భీంగల్: రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నిజామాబాద్‌జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిని నియమించడంతో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరే స్వామి, డిసిసి డెలిగేట్ కుంట రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు హరీష్, బీసీ సెల్ అధ్యక్షులు కొరాడి రాజు, నిజామాబాద్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొనకంటి రాజేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డిని ముప్కాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీసీసీ డెలిగేట్ కార్యదర్శి జైది చంద రవి, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాజ్ వెంకట్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, నరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు..

ఏర్గట్ల: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమించినందున ఏర్గట్ల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరెన్నో పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ రేండ్ల రమేష్, కాంగ్రెస్ నాయకులు రొక్కెడ సంజీవ్, శామ్సన్, గజేంధర్, హరీష్ పాల్గొన్నారు.



ఏర్గట్ల : సన్మానించి బొకే అందజేస్తున్న నాయకులు

ఆటోను ఢీకొన్న మైనింగ్ లారీ..

- ఆరుగురికి గాయాలు



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో ఆటోను మైనింగ్ లారీ ఢీకొన్న ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాన్సువాడ మండలం కోయగుట్ట తండా నుంచి పెండ్లిని కాయం చేసుకోవడం నిమిత్తం యువతి గ్రామం గాంధారి మండలం డప్పుతండాకు వచ్చి కార్యక్రమం ముగించుకొని తిరిగి వెళుతుండగా సాయంత్రం సమయంలో గాంధారిలో వ్యవసాయ మార్కెట్ మూలమలుపు వద్ద ఆటోను వెనుక నుంచి చద్మల్ వైపు నుంచి గాంధారి వైపు వస్తున్న మైనింగ్ లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మైనారిటీ జిల్లా కార్యదర్శిగా హైమద్ నియామకం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ హైమద్ జిల్లా మైనార్టీ కార్యదర్శిగా నియమించడంపై దూపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హైమద్ బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు ఇమ్రాన్ అలీకి శాలువాకప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హైమద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇవ్వడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దూపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, జిల్లా కార్యదర్శి సి.హెచ్.రాములు, బాబన్న, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు

- రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటది
- గత ప్రభుత్వం తీరుతో బీమా లేక రైతులకు తీవ్ర నష్టం : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- ప్రభుత్వం ఆదుకోవాలి : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం
- నష్టపరిహారం ఇప్పిస్తా : కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- పొలం బాట పట్టిన ప్రజాప్రతినిధులు



దోమకొండ : నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ



ఎడపల్లి : పంటలను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-విలేకరులు

అకాల వర్షంతో నష్టపోయిన పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. గత ప్రభుత్వం తీరు వల్లే రైతులకు పరిహారం అందడం లేదని, సహకార సంఘాలను నిర్వీర్యం చేసి రైతులకు ఇన్సూరెన్స్ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించనున్నట్టు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

నసురుల్లాబాద్ : బాన్సువాడ నియోజకవర్గం లోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు బీర్కూర్ మండలం కిష్టాపూర్, బీర్కూర్, అన్నారం, చించోలి గ్రామ శివారులో నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. వడగళ్ల వానతో నష్టపోయిన వరి పంట పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని చూసి రైతులు కన్నీరు మున్నీరయ్యారు. పంట పొలాల వద్ద నుంచి జిల్లా కలెక్టర్ కు, జిల్లా వ్యవసాయ అధికారికి ఫోన్లో మాట్లాడారు నష్టపోయిన పంట వివరాలను సేకరించి రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. అలాగే బాన్సువాడ నియోజకవర్గంలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను కోరారు. ఇప్పటికే పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభం అయ్యాయని అందుకు అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ అకాల వర్షాలతో నోటికి వచ్చిన బుక్క జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంత సహాయం చేసిన రైతుకు తక్కువే అని అన్నారు. రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుక వెళ్తానన్నారు. యుద్ధప్రాతిపదికన నష్టపోయిన ధాన్యం పంటల వివరాలు సేకరించాలని జిల్లా అధికారులకు కోరారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలంలో కురిసిన వడగళ్ల వానకు, గాలి దుమారానికి సుమారు 500 ఎకరాల వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పలు గ్రామాల్లో పర్యటించి నేలవాలిన వరిని పరిశీలించారు. ఏ గ్రామంలో ఎన్ని ఎకరాల్లో నష్టం వాటిల్లిందో వ్యవసాయశాఖ అధికారులు సమగ్ర వివరాలు సేకరించి నివేదిక అందించాలని ఆదేశించారు. రైతులు తప్పకుండా పంట బీమా చేయించుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నట్లయితే బీమా అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరెంటీ లింగం, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కారాటూరి సత్యనారాయణ తదితరులున్నారు.

బోధన్ : అనంతరం బోధన్ ఉమ్మడి మండలంలోని నాగన్ పల్లి, సాలూర క్యాంప్, కుమ్మన్ పల్లి తదితర గ్రామ శివారులో ఈదురు గాలులు వర్షంతో నేలకొరిగిన మొక్క జొన్న, వరి పంటలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ మండలంలోని నాగన్ పల్లి, సాలూర క్యాంప్, కొప్పర్తి క్యాంప్, జాడీ జమాల్ పూర్ ప్రాంతాలలో సుమారు 500 ఎకరాలలో వరి, మొక్కజొన్న పంటలు ఈదురు గాలులు వర్షంతో నేలకొరిగిందని దాంతో రైతులు నష్టపోయారని అన్నారు. విత్తన కంపెనీలు నాసిరకమైన ,కల్తీ విత్తనాలు విక్రయించడంతో మొక్కజొన్న కంకులు సక్రమంగా ఎదగలేదని దాంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆరుతడి పంటలు వేసిన రైతులకు శనివారం కురిసిన అకాల వర్షంతో నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తులో నకిలీ విత్తనాలు రాకుండా వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం తీరుతో రైతులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. సహకార బ్యాంకు వ్యవస్థను కెసిఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని కనీసం నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ అందించలేదని అన్నారు. ప్రభుత్వం ద్వారా భవిష్యత్తులో రైతులు నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలో సిరికొండ ,ఇందల్వాయి, ధర్పల్లి, బీర్కూర్, కోటగిరి ,బోధన్ తదితర ప్రాంతాలలో నష్టపోయిన పంటల సర్వే చేయడానికి అధికారులను డిప్యూటేషన్ పై నియమించి పంట వివరాలు సేకరిస్తామని అన్నారు. వర్షాకాలం సీజన్ నుంచి పంటలకు ఇన్సూరెన్స్ అందించే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఆయన వెంట ఇంచార్జి ఏడీ సంతోష్, ఏఈఓ అపర్ణ, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గంగా శంకర్, నాగేశ్వరరావు ,మందరన్న రవి, అల్లె రమేష్, తూము శరత్ రెడ్డి, తూము రవి, నర్సారెడ్డి, సంతోష్ రెడ్డి,చీలా శంకర్ రైతులు ఉన్నారు.

పంటలు పరిశీలన

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం సాయంత్రం కురిసినటువంటి వర్షానికి సుమారు 200 ఎకరాలలో పంటకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఆదివారం పంటలను పరిశీలించారు. పోతంగల్ మండలంలోని కల్లూరు, కోటగిరి మండలంలోని లింగాపూర్ ,బస్వాపూర్, కొత్తపల్లి తదితర గ్రామాలలో పంట పొలాలు పరిశీలించారు. పాలు పోసుకున్నటువంటి పొలాలు అడ్డం పడిపోయాయని నష్టపోయిన పంట పొలాల రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ విస్తీర్ణాధికారి గౌస్, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన ఎమ్మెల్యే

కామారెడ్డి : మండలంలోని వివిధ గ్రామాలలో నష్టం వాటిల్లిన పంటలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. మండలం తిమ్మక్ పల్లి గ్రామంలో మక్కా , వరి పంటలను పరిశీలించి, ఆక్కడి నుండి చిన్న మల్లారెడ్డి, లింగాయ పల్లి, కొటాల్ పల్లి, నర్సన్న పల్లి , చిన్న మల్లారెడ్డి, లింగాయ పల్లి, కొటాల్ పల్లి, నర్సన్న పల్లి గ్రామాల్లో పరిశీలంచారు. రైతులు అధైర్యపడొద్దని, ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం నుంచి నష్టపరిమాందేలా చూస్తానని రైతులకు భరోసా ఇచ్చారు.

రైతులకు అండగా ఉంటాం : షబ్బీర్

దోమకొండ/భిక్కనూర్ : మండలం గొట్టిముక్కుల, భిక్కనూర్ మండలం లక్ష్మి దేవనపల్లి, అంతంపల్లి, రామేశ్వరం పల్లి, జంగంపల్లి, రాజంపేట మండలం తలమడ్ల, ఆరేపల్లి, పెద్దయిపల్లి, రాజంపేట, కామారెడ్డి మండలం పాత రాజంపేట, నరసన్న పల్లి, గ్రామంలో వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను షబ్బీర్‌అలీ పరిశీలించారు. నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పంట నష్టపోయిన ప్రాంతాలలో అధికారులను పంపించి నివేదికలు తెప్పించుకొని రైతులందరిని ఆదుకుంటామని చెప్పారు. ఆయన వెంట కైలాస్ శ్రీనివాసరావు, భీమ్ రెడ్డి, గాలిరెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, తిరుమల గౌడ్, చంద్రకాంత్ రెడ్డి, కుంట లింగారెడ్డి, యాదవ రెడ్డి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో పరిశీలించిన అధికారులు

బోధన్ : వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే నేలకొరిగిన పంట వివరాలను సేకరించి నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాలతో బోధన్ మండల వ్యవసాయ అధికారి ఇన్చార్జి ఏడిఏ సంతోష్ సాలూర క్యాంప్ గ్రామ శివారులో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. బోధన్ ఉమ్మడి మండలంలోని సాలూర క్యాంప్, జాడి జమాల్పూర్, కొప్పర్తి క్యాంప్, నాగన్ పల్లి గ్రామాలలో 300 ఎకరాలలో మొక్కజొన్న, 150 ఎకరాలలో వరి పంట నేలకొరిగిందని తెలిపారు. పంట నష్టం జరిగిన విరాలను ప్రభుత్వానికి అందిస్తామని ఏవో ఇన్చార్జి ఏడీఏ సంతోష్ తెలిపారు. ఆయన వెంట ఏఈఓ అపర్ణ, రైతులు చీల శంకర్, మందన్న రవి, సుబ్బారావు, అహుతూ మహేష్ ఉన్నారు.



నసురుల్లాబాద్ : నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే



భిక్కనూర్ : పంటలను పరిశీలిస్తున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే

పది పరీక్షలు పకడ్బందీగా సాగేనా..?

- మాందాపూర్ సెంటర్‌పై మాస్ కాపీయింగ్ ప్రచారం
- ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న ఇన్విజిలెటర్లు
- పదిలో పాస్, ఇంటర్‌లో ఫెయిలవుతున్న విద్యార్థులు
- ఫలితాల కోసం పక్కదారి పడుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలు



నవతెలంగాణ-కామారెడ్డి

తమ పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంతో ఆశతో ఆ తల్లిదండ్రులు కలలుగంటారు. కానీ కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు మంచి ఫలితాల కోసం మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్నాయి. ఇన్విజిలెటర్లను మచ్చిక చేసుకుని తమ విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చేలా మాస్‌కాపీయింగ్‌కు చేయిస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయుల కారణంగా ఎలాగైనా పదవ తరగతిలో తమ విద్యార్థులను పాస్ చేయించాలని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు పక్కదారి పడుతున్నారు. ఒకప్పుడు ఎలాగైనా పాస్ అవ్వాలని విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతుంటే, ఇప్పుడు తమ విద్యార్థులు ఎలాగైనా పాస్ అవ్వాలని ఉపాధ్యాయులే మాస్ కాపీయింగ్‌కు ప్రేరేపిస్తున్నారు.

ఈనెల 18న సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. కష్టపడి చదువుకున్న విద్యార్థులకు10/10 మార్కులు వస్తుంటే.. కొన్ని పరీక్ష కేంద్రాలు, ఇన్విజిలెటర్ల సహకారంతో కొందరు విద్యార్థులకు మాస్‌కాపీయింగ్‌తో 10/10 మార్కులు వస్తున్నాయి. పరీక్షా ఫలితాలు వచ్చిన తర్వాత ఫలితాలను చూసి కష్టపడి చదువుకున్న విద్యార్థులు నివ్వెర పోతున్నారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఇన్విజిలెటర్లతో కుమ్మక్కవుతూ తమ విద్యార్థులను ఎలాగైనా పాస్ చేయించాలని పరీక్షలు ప్రారంభం కాకముందే ఒప్పందం చేసుకుంటున్నారని సమాచారం.

పదవ తరగతి పరీక్షలలో జిల్లాలోని మాస్ కాపీయింగ్ సెంటర్‌గా మాందాపూర్ పరీక్ష కేంద్రం ఉందని జోరుగా ప్రచారం సాగుతోంది. కొందరు జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల కాలంలో భిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామస్తులు మాందాపూర్ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ పరీక్షా కేంద్రంలో ఎవరు పరీక్షలు రాసిన 10/10 మార్కులు రావడం, తర్వాత ఇంటర్మీడియట్, ఐఐఐటి పరీక్షలలో ఫెయిల్ అవుతున్నారు. చదువురాని విద్యార్థులు సైతం మాందాపూర్, కాచాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిపిస్తే ఎలాగైనా పాస్ అవుతారని ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులను మాందాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

10 పరీక్షలలో ఎలాగైనా తమ విద్యార్థులు 10/10 మార్కులు సాధించాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం కొందరు ఇన్విజిలేటర్లతో తమ విద్యార్థులను పాస్ చేయించాలని ఒప్పందం చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. గతంలో భిక్కనూర్ మండలంలో ఓ ప్రైవేట్ విద్యా సంస్థ ఒక ఇన్విజిలేటర్‌తో ఒప్పందం చేసుకొని మార్కులు సాధించినట్లు సమాచారం. ప్రస్తుతం కూడా మాందాపూర్ పరీక్ష కేంద్రం నిర్వాకం, ఇన్విజిలేటర్ల చేతివాటం చూపిస్తారేమోనని కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా యంత్రాంగం మేల్కోని ఇప్పటికైనా పక్కదారి పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం, ఇన్విజిలెటర్‌లపై నిఘా ఏర్పాటు చేసి, పరీక్షా కేంద్రాలకు పరీక్షా సమయంలో చేతివాటాలు ప్రదర్శించకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, కొందరు ప్రైవేట్ విద్యా సంస్థలు కోరుతున్నారు.

రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాలరాజ్

- ఆయన్ను కలిసిన అభినందనలు తెలిపిన పలువురు

నవతెలంగాణ-బిచ్కుంద/నసురుల్లాబాద్/వర్ని



బిచ్కుందలో సన్మానం...

బాన్సువాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసుల బాలరాజును రాష్ట్ర అగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో పలువురు నాయకులు, మున్నూరు కాపు కులస్తులు ఆయనను కలిసి అభినందించారు. ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రజలకు సేవలు అందించినందుకుగానూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి కాసుల బాలరాజ్‌కు చైర్మన్ పదవి అప్పజెప్పడంపై బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జుక్కల్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కొండగంగాధర్ తన అనుచరులతో కలిసి బాన్సువాడలో కాసుల బాలరాజును ఘనంగా సన్మానించారు. అనంతరం కొండ గంగాధర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మున్నూరు కాపు నాయకులకు చిన్న చూపు చూసి అణచివేతకు గురయ్యారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత అన్ని కులాలకు సమానత్వంతో పదవులు కేటాయించి ముందుకు నడుస్తున్నారని అన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కుంటెల్లప్ప గంగాధర్, రాజు, ఈరన్న ఉన్నారు.

నసురుల్లాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాలరాజ్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆదివారం బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజును బీర్కూర్ మున్నూరు కాపు సంఘ నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాసుల బాలరాజ్ మాట్లాడుతూ తనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కాసులకు పదవి దక్కింది

వర్ని : బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో కూడా కార్యకర్తలతోనే ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికలలో సీటు ఇవ్వని వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారు. అందులో భాగంగా కాసుల బాలరాజును శనివారం తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. దీంతో వర్ని మండల నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. ఆయనను చందూర్ జడ్పీటీసీ శాలువాతో సన్మానించారు. అయితే పదవి కోసం బాన్సువాడ నియోజకవర్గం నుంచి సీనియర్ నాయకులు కూడా ఆశ పడినట్లు తెలుస్తుంది. కానీ కష్ట కాలంలో కాసుల బాలరాజు కాంగ్రెస్‌తో ఉండటంతోనే ఈ పదవి వరించినట్టు తెలుస్తోంది.

కాసులకు మంచి అవకాశం..

మూడుమార్లు ఓటమి పాలైనా కాసుల కాంగ్రెస్ పార్టీని విడువలేదు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఏది ఏమైనా ఒక పదవి రాగానే ఏనుగు రవీందర్‌తో ఉన్నవారు కాసుల వైపు మొగ్గు చూపుతున్నారనేది పార్టీ కార్యకర్తల, శ్రేణుల నుంచి సమాచారం. నియోజకవర్గంలో ఇద్దరు బలమైన నాయకులు ఉండడంతో మరో ఐదు ఏళ్లలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ ఎవరికి ఇస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

- నేటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నేటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. అయితే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. విద్యార్థులు పరీక్షలు సజావుగా రాసేందుకు గానూ విద్యాశాఖ అధికారులు ఆయా పరీక్షా కేంద్రాల్లో అన్నీ ఏర్పాట్లు చేశారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. జానకంపేటలోని జెడ్పిహెచ్ఎస్, ఎడపల్లి మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, ఎడపల్లిలోని తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. బాలురు 243, బాలికలు 231, మొత్తం 445 మంది బాలబాలికలు మూడు పరీక్ష కేంద్రాలలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్..

పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాసి 100శాతం జిపిఏ సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో ఆకాంక్షించారు.

లింగంపేట్ : మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలలో అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలను సమకూర్చినట్టు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలియజేశారు. తాగునీరు వసతి, టాయిలెట్ల సౌకర్యం, విద్యార్థులకు సరిపడే బల్లలు అన్ని సమకూర్చినట్టు వివరించారు. మొదటిరోజు విద్యార్థులు ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకొని హాల్‌టికెట్ ఆధారంగా రూములను సరిచూసుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. బాలుర ఉన్నత పాఠశాల, లింగంపేట్ పరీక్ష కేంద్రంలో 260 మంది విద్యార్థులు, జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల కేంద్రంలో 241 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలియజేశారు. పరీక్ష కేంద్రానికి సమయానికంటే ముందుగానే రావాలని, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత వచ్చిన విద్యార్థులకు అనుమతి లేదని తెలియజేశారు. కాబట్టి విద్యార్థులందరూ అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయం ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటుందని, అలాగే హిందీ పరీక్ష రోజు మాత్రం 9:30 గంటల నుంచి 12:50 నిమిషాల వరకు ఉంటుంది ఆయన అన్నారు.

ఐదారునెల్లుగా వేతనాల్లేవ్

- జీపీ కార్మికులకు వేతనాలు అందక ఇబ్బందులు

నవతెలంగాణ-ఎడపల్లి



సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికులకు సరైన సమయంలో వేతనాలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం లేని తమకు ఉన్న వేతనం సైతం సమయానికి అందక.. కుటుంబ పోషణ భారంగా మారిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లాలో 29 మండలాలుండగా, 530 మేజర్, మైనర్ గ్రామపంచాయతీలున్నాయి. అయితే ఇందులో వివిధ గ్రామపంచాయతీల్లో 253 మంది బిల్ కలెక్టర్లతో పాటు పారిశుధ్య కార్మికులు, వాటర్ మెయిన్, ఎలక్ట్రిషన్, ఇతర సిబ్బంది కలిపి వివిధ కేటగిరీల్లో సుమారు 2663 మంది కార్మికులు ఉన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా సుమారు 3641 మంది గ్రామపంచాయతీలలో విధులు నిర్వహిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులు తెల్లవారుజామున విధుల్లోకి చేరుకుని తిరిగి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరిసరాలను పరిశుభ్ర చేయడమే కాకుండా మురికి కాలువలను శుభ్రం చేస్తారు. తీసిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు రోజుకు రెండు పూటలా విధులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ పనిచేయడంతో పనిభారం ఎక్కువవుతోంది. కానీ వేతనం మాత్రం తక్కువగా ఉందని కార్మికులు వాపోతున్నారు.

అయితే జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల కార్మికులకు నాలుగు నుంచి ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వారు కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. తమకు వేతనాలు వెంటనే చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


వీరికి బీమా పథకం అమలులో లేదు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం లేదు. ప్రమాద బీమా అసలే లేదు. పారిశుధ్య పనుల్లో భాగంగా ఏదైనా జరిగరానిది జరిగితే దానికి గ్రామపంచాయతీ బాధ్యత వహించాల్సి ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణాలున్నాయి. గత ప్రభుత్వం 14.8.2023న ఎల్ఐసి బీమా అమలు చేయాలని చెప్పినా నేటికీ అది అమలుకు నోచుకోలేదు. పై సమస్యలపై జీపీ పారిశుధ్య కార్మికులు వేతనాలు పెంచాలని పలుమార్లు సమ్మెలు, ధర్నాలు చేపట్టినప్పటికీ, అధికారులకు విన్నపాలు చేసినప్పటికీ సమస్యలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెట్టుకొస్తున్నాం



నిజామాబాద్ జిల్లాలో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు దళిత కుటుంబాలే. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. కొన్ని మండలాల్లో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చాలా నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. తమకు నెలా నెలా జీతాలు రాక ఆకలితో తమ కుటుంబాలు అలమటిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశుద్ధ కార్మికులకు, సిబ్బందికి బకాయి వేతనాలతో పాటు నెలవారి జీతాలను మంజూరు చేయాలి. **- తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు, జొగ్గరి పద్మ**

వేతనాలు త్వరగా చెల్లించాలి



గ్రామపంచాయతీ కార్మికులకు జీరో వన్ జీరో గ్రాంట్ ద్వారా జీతాలు అమలు చేయాలి. బేసిక్ ద్వారా వేతనాలు చెల్లించాలి. జీవో 60 ప్రకారం సఫాయి కార్మికులకు నెలకు రూ.15,600 చెల్లించాలి. బిల్ కలెక్టర్లకు, కారోబార్లకు రూ.19,500 నెలవారీగా చెల్లించాలి. **- జంగం గంగాధర్, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి**